క్లుప్తంగా

వనితా క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


బెల్లి లక్ష్మీప్రసన్న, అధ్యక్షురాలు


చెరుకు కవిత, ప్రధాన కార్యదర్శి


గరిణె జ్యోతి, కోశాధికారి

నేరేడుచర్ల : నేరేడుచర్ల వనితా క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలో వాసవీ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షురాలిగా బెల్లి లక్ష్మీప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా చెరుకు కవిత, కోశాధికారిగా గరిణె జ్యోతిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వనితా క్లబ్ అధ్యక్షురాలు బెల్లి లక్ష్మీసన్న మాట్లాడుతూ వనితా క్లబ్ ద్వారా సమాజంలోని అన్ని వర్గాల పేదలకు సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత


దీపక్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న సురేష్

చిలుకూరు : హైదరాబాద్‌కు చెందిన దీపక్ అనారోగ్యంతో బాధపడుతూ అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న చిలుకూరు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ బాధితుడికి చేయూత అందించాలని సంకల్పించి దాతల ద్వారా రూ.15,300 సేకరించింది. మంగళవారం ఆ ఆర్థికసాయాన్ని సంస్థ సభ్యుడు కస్తూరి సురేష్ అనారోగ్య బాధితుడికి అందజేశారు.

ఆలయానికి వితరణ


నగదు అందజేస్తున్న శారద- రాజశేఖర్ కుటుంబసభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో పునర్నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో అన్నపూర్ణ సమేత బోలా లింగేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభానికి, స్వామివారికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గన్నవరపు రాజశేఖర్, శారద దంపతుల కుటుంబసభ్యులు వెండి ఆభరణాలు బహూకరించారు. వెండి ఆభరణాల కొనుగోలుకు నగదును ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా, ఉత్సవ కమిటీ సభ్యులకు మంగళవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి 20 వరకు విగ్రహాల ప్రతిష్ఠ ఉందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ, ఉత్సవ నిర్మాణ కమిటీ సభ్యులు పైడిమర్రి వెంకటనారాయణ, పైడిమర్రి నారాయణరావు, గరిడేపల్లి లక్ష్మణరావు, పందిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, ఆంజనేయస్వామికి పంచామృతాలు, తమలపాకులతో అభిషేకం, మన్యసూక్త పారాయణం, రామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలి

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని స్థానిక సంఘం చైర్మన్ కొల్లు రామారావు కోరారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 28న రత్నవరంలో నిర్వహించనున్న సహకార సంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఈఓ యలమందరావు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు అందక ఇబ్బందులు

- కష్టతరంగా మారిన గ్రామ పంచాయతీ కార్మికుల జీవనం
- కొండాపురం మినహా పదహారు జీపీల్లో ఇదే పరిస్థితి
- ప్రతినెలా అందజేయాలని వేడుకోలు


పోలేనిగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

చిలుకూరు : గ్రామ పంచాయతీ కార్మికులకు సరైన సమయానికి జీతాలు అందడం లేదు. దీంతో వారి జీవనం కష్టతరంగా మారింది. పొద్దుపొడవక ముందే గ్రామాన్ని శుభ్రం చేస్తున్నా తమకు పాలకులు, అధికారులు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గ్రామ పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే డబ్బులతోనే పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది.

మండలంలోని పంచాయతీల్లో ఇలా..

చిలుకూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా, చిలుకూరు జీపీలో మల్టీ పర్పస్ సిబ్బంది 13 మంది ఉండగా వీరికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు. అలాగే బేతవోలు జీపీలో 22 మంది సిబ్బంది ఉండగా 9 నెలల నుంచి జీతాలు అందలేదు. ఆచార్యులగూడెం జీపీలో ఉన్న ముగ్గురు మల్టీ పర్పస్ సిబ్బంది సంవత్సరం నుంచి జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. చెన్నారిగూడెం జీపీలో ఉన్న ఐదుగురు సిబ్బంది 10 నెలల నుంచి జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జెర్రిపోతులగూడెం జీపీలో ఏడుగురు సిబ్బంది ఉన్నారు. వీరికి 5 నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. పోలేనిగూడెంలో ఐదుగురికి 9 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. మాధవగూడెంలో ఇద్దరు ఉండగా వీరికి 7 నెలల నుంచి, కొమ్ముబండతండా జీపీలో ఇద్దరు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వీరికి 7 నెలల నుంచి, ఆర్లెగూడెం జీపీలో ముగ్గురు ఉండగా వీరికి 7 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. రామ్‌చంద్రానగర్ జీపీలో ఇద్దరు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వారికి 8 నెలల నుంచి, రామాపురం జీపీలో ఏడుగురు ఉండగా వారికి 2 నెలల నుంచి, సీతారాంపురం జీపీలో ముగ్గురు ఉండగా వారికి 9 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నారాయణపురంలో ఏడుగురు సిబ్బంది ఉన్నారు. వారికీ 2 నెలల నుంచి, సీత్లాతండా జీపీలో ఐదుగురు సిబ్బంది ఉండగా వారికి 3 నెలల నుంచి జీతాలు రావడం లేదు. దూదియాతండాలో ఐదుగురు సిబ్బంది ఉండగా వారికి 7 నెలల నుంచి, జానకీనగర్ జీపీలో ముగ్గురు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా 6 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. అయితే కొండాపురం జీపీలో మల్టీ పర్పస్ సిబ్బంది ఆరుగురు ఉండగా వీరికి మాత్రం ప్రతినెల జీతాలు ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా 100 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా జీతాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రతా కల్పించాలి. అప్పుడైతే ప్రతినెల జీతాలు అందుతాయి. అదేవిధంగా 51 జీఓను రద్దు చేయాలి.

– తిరగమల్ల వెంకటేశ్వరరావు, జీపీ కార్మికుల ఉద్యోగ సంఘం మండల ప్రధాన కార్యదర్శి

● ఉత్కంఠభరితంగా ఎద్దుల పందేలు


మహాశివరాత్రి జాతర సందర్భంగా మేళ్లచెరువులోని ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు మంగళవారం ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పందేలను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. -మేళ్లచెరువు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కోదాడ : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన పిల్లుట్ల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిల ఆధ్వర్యంలో పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట బట్టు శ్రీహరి తదితరులు ఉన్నారు.


కోదాడ : ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పిల్లుట్ల శ్రీనివాస్

సొంతగూటికి చేరిన నాయకులు

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరిగి సొంత గూటికి చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో వారు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వాస్తురేఖ నాగేశ్వరరావు, చిట్టేటి వెంకటేశ్వర్లు, జయరాజు, పనస గోపి, మండవ నాగార్జున్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెమిడాల ఆనందరావు, మండవ గురునాథం, బిట్టు రామకృష్ణ, చందా వెంకటేశ్వర్లు, పుట్టపాక నర్సయ్య, కమతం కొండలు తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరు : ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

అలరించిన 'పల్నాటి యుద్ధం' నాటకం


పల్నాటి యుద్ధం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు


స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో శ్రీశంభులింగేశ్వర స్వామి నాట్య కళామండలి అధ్యక్షుడు పోశం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులు సంయుక్తంగా ప్రదర్శించిన పల్నాటి యుద్ధం పద్య నాటకం ఆహుతులను అలరించింది. ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజు దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటకంలో పోశం వెంకటరెడ్డి, ఎస్‌కే సైదులు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సత్యపాల్ రాజ్, రాంబాబు, బాలునాయక్, నరసింహారావు, మామిడి కొండలు, ఉప్పు కృష్ణారావు, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, వీరమణి, అశ్విని, ప్రకాష్‌బాబు, యోగానందరెడ్డి, గురుబ్రహ్మాచారి, వెంకటరెడ్డి, జయశంకరాచారి, రమేష్, ప్రసాద్, నాగెళ్ల శంబిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్ణాహుతి

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా మంగళవారం ఉదయం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా సుప్రభాతం, వసంతోత్సవం, త్రిశూలతీర్థం, ఆశీర్వచనములు, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, పుష్పాలంకరణ, మహనివేదన, మంగళ నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

చేపలు మృతి


ఊర చెరువులో మృతిచెందిన చేపలు

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం ఊర చెరువులో కొద్ది రోజులుగా వైరస్ సోకి చేపలు మృత్యువాత పడుతున్నాయని, ఇప్పటి వరకు దాదాపు ఆరు టన్నుల వరకు చేపలు మృతి చెందినట్లు పలువురు మత్స్యకారులు మంగళవారం తెలిపారు. సంబంధిత అధికారులు చెరువును పరిశీలించి నివారణ చర్యలను విశ్లేషించాలని కోరారు. బీమా సౌకర్యం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

హుజూర్‌నగర్ : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ధనుంజయ నాయుడు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆ సంఘం పట్టణ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన మాదిరిగానే బీసీలకు కూడా రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న వారికి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ధూళిపాల శ్రీనివాస్, గోవిందరావు, అంజియాదవ్, గూడెపు దీప, రాయల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, ముషం సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీను, కె.వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని స్థానిక శ్రీ సాయి పబ్లిక్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బుస్సా సులోచన అన్నారు. మంగళవారం ఆ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, రమ్య, హర్ష, వీరయ్య, హనీఫా, మల్లికా, ఉష పాల్గొన్నారు.

విక్రమ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు, మహిళలు

నేరేడుచర్ల : సీపీఐఎంఎల్ ప్రజా పంథా నేత విక్రమ్ స్ఫూర్తితో పేదల సమస్యలపై పోరాడుతామని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ వాసా పల్లయ్య అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో విక్రమ్ 31వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, కరుణాకర్, వెంకన్న, మరియమ్మ, మల్లేశ్వరీ, మౌలాంబీ, లక్ష్మి, పావని, కావ్య, బుచ్చమ్మ, ఫాతిమా, సయ్యద్, వెంకన్న తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

అనంతగిరి : వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాలారం గ్రామపంచాయతీ పరిధిలో రెండు తాగు నీటి బోర్ల ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4.40 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సైదులు, ముక్కా కాశయ్య, షేక్ ఖాసీంరిజ్వి, సయ్యద్ సిరాజ్, సురేష్, సయ్యద్ సైదులు, సయ్యద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ గావించారు. అనంతరం స్వామికి మహార్నివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, కార్యదర్శి కోటతిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, ఆలయ కమిటీ సభ్యులు కొండ్లే రవికుమార్, సత్యం, కృష్ణమూర్తి, చారి, వంశీకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల మున్నూరు కాపు సంఘం నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కోలా నాగేశ్వరరావు, నాయకులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, నాగ సైదులు, అవుల వెంకటయ్య, తోట నరసింహారావు, కాల్వ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

మునగాల: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై మునగాల శివారులో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం పట్టణానికి చెందిన బొడ్డు అఖిలాష్, మరో ముగ్గురితో కలిసి మంగళవారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మునగాల వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కామేశ్వరరావుకు తీవ్ర కాగా మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

నాలుగు ఆటోలపై కేసు నమోదు

మునగాల: మండల కేంద్రం శివారులో మంగళవారం రాత్రి పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకొని వెళ్తున్న ఆటోలపై మునగాల ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి కొరడా ఝుళిపించారు. నాలుగు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడంతో కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

నడిగూడెం : గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం నడిగూడెంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'గంజాయి నిర్మూలన –మనందరి బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు.. ఉపాధ్యాయులు, అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్.ఇమామ్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, అజ్మతుల్లా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

మునగాల : రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో కొంతమేర తమ కుటుంబ అవసరాల కోసం ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపి కోరారు. మంగళవారం మునగాల మండలంలోని ఆకుపాములలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని.. పంట ఆరోగ్యమే మన ఆరోగ్యమన్నారు. భూసారం పెరగాలంటే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పశువుల పెంట ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా పైర్లలో ఆశించే చీడపీడల నివారణకు నీమాస్త్రం, వేపగింజలు, వావిలాకు, తుటికాడ, ఆవుమూత్రం, పేడ, ఇంగువ ద్రవాలను తయారు చేసుకొని వాడితే సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో గల ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మంజూరైన డీఎంఎస్‌టీ నిధులతో 5 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు లక్షల ఇరువై వేల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కాలనీలో బోర్ వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, బొర్ర మధు, వెంకన్న, కాలనీ వాసులు, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లు పాపయ్య చౌదరి వర్ధంతి

నడిగూడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యా దాత కొల్లు పాపయ్య చౌదరి 68వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్ బాబు, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వేణుగోపాలపురం మాజీ సర్పంచ్ కొల్లు శత్రజ్ఞుడు, దేవబత్తిని రమేష్‌బాబు, గడ్డం మల్లేష్, బాణాల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆధునీకరణ పనుల శిలాఫలకాన్ని ఎంపీడీఓ లావణ్యతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ఆరోపించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ క్యార్యక్రమంలో ఎంపీటీసీలు వల్లభనేని విజయలక్ష్మి, కాశమ్మ, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మాజీ సర్పంచ్ దొంగిరి సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వీరనాగిరెడ్డి, నర్సిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయ ఆధునీకరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


మఠంపల్లి : త్రివేణినగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు


హుజూర్‌నగర్ : సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని త్రివేణి నగర్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సోమిరెడ్డి గోవిందరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోలి చంద్రం, నాయకులు ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, తిరుపయ్య, నాగిరెడ్డి, లింగారెడ్డి, పిచ్చయ్య, సైదులు, జానమ్మ, గురువయ్య, అంజి, సైదాహుస్సేన్, మైబు, తదితరులు ఉన్నారు.

15వ వార్డులో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని 15వ వార్డులో రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన రూ.4 లక్షల నిధులతో రోడ్డు, డ్రెయినేజీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, ముశం సత్యనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, రామ్మూర్తి, డేవిడ్ యోహాన్, బాబురావు, పేతురు, రాజేష్, హరీష్, నాగేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుశ్చర్ల సత్యనారాయణ జన్మదిన వేడుకలు

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో జల సాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ జన్మదిన వేడుకలను మంగళవారం సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బొమ్మరబోయిన కేశవులు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ పీడిత నల్లగొండ జిల్లాకు తాగు, సాగు నీటి కోసం కేంద్రం, రాష్ట్రంతో కొట్లాడి నీరు అందించిన మహా ధైర్యశాలి సత్యనారాయణ అని ఆయన కొనియాడారు. అడవిని సృష్టించి పర్యావరణాన్ని రక్షిస్తున్న గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, ఎస్‌బీఐ మోతె బ్రాంచ్ మేనేజర్ సుమన్, ఏఎస్ఐ సత్యనారాయణ, గునగంటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పలువురు అధికారులు, విద్యార్థులు, తదితరులు

వైభవోపేతం.. నృసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు. అంతేగాక మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, నాగభూషణం, సీతారామాచార్యులు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు